ఎస్‌టియు జిల్లా కమిటీలో ప్రాధాన్యత

ప్రజాశక్తి-పోరుమామిళ్ల

ఎస్‌టియు జిల్లా కార్యక్రమంలో మండలానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని నాయకులు పేర్కొన్నారు. మండలం నుంచి రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎం.రామకృష్ణారెడ్డి, ఒ.చంద్రాహాసరెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా పుల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులుగా జి.పి.కుల్లాయప్ప, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి.శ్రీనివాసులు, మెంబర్లుగా ఎం.నారాయణరెడ్డి ఎస్.అబ్దుల్ హుస్సేన్, ఇ.ఆనంద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్ష, ప్రధాన, ఆర్థిక కార్యదర్శులు కె.పుల్లయ్య, ఎ.జయరాంరెడ్డి, బి.బాష పేర్కొన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సంఘం నాయకులు మాట్లాడుతూ మండలంలో సంఘ బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తమ శక్తి మేరకు కృషి చేస్తామని తెలిపారు.

ఒంటికాలిపై నిల్చుని అంగన్వాడీల నిరసన

- ప్రభుత్వ బెదిరింపు జిఒ ప్రతులు దహనం
- భిక్షాటన చేస్తూ ఆందోళన
- 24వ రోజూ కొనసాగిన సమ్మె

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ వైఎస్ఆర్ జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి 24వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహాశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగిస్తున్నారు. భిక్షాటన చేస్తూ, ఒంటి కాలిపై నిల్చుని, ప్రభుత్వ బెదిరింపు జిఒ ప్రతులను దహనం చేస్తూ తమ నిరసనను తెలియజేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్వాడీలు మాత్రం సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె విరమించేది లేదంటూ నినాదాలు చేశారు. అంగన్వాడీల సమ్మెకు పార్టీలు, ప్రజలు, ప్రజా సంఘాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోంది.

పోరుమామిళ్ల : భిక్షాటన చేస్తూ అంగన్వాడీల నిరసన

ప్రజాశక్తి-కడప అర్బన్

వేతనాలు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గ్రాట్యుటీ చెల్లించాలన్న ప్రధాన డిమాండ్లతో నిర్వహిస్తున్న సమ్మె గురువారం నాటికి 24వ రోజుకు చేరుకుంది. అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ఒంటి కాలిపై వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి పి.వెంకట సుబ్బయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి.అన్వేష్, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం.ఓబులేసు మాట్లాడుతూ అంగన్వాడీలు 24 రోజులుగా రోడ్డున పడి సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోగా అంగన్వాడీలపై అబద్దాలను ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికే సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం చేయని ప్రయత్నం అంటూ లేదని చెప్పారు. అంగన్వాడీల సమస్యలు అన్నీ పరిష్కరించాం, విధులలో చేరాలని ఒక అధికారి అంటున్నారని, ఇది ప్రజలలో అంగన్వాడీలపై వ్యతిరేక భావనను ప్రచారం చేయడంలో భాగమన్నారు. ప్రధాన డిమాండ్లపై తేల్చకుండా చివరి ఒకటి,రెండు డిమాండ్లను పరిష్కరించినంత మాత్రాన సమ్మె ఎలా ఆగుతుందని ప్రశ్నించారు. మరోవైపు పలానా సమయంలోగా ఉద్యోగాలలో చేరకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు అంజనీ దేవి, దీప, వినిలా, వసుంధర పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** జీతాలు పెంచాలంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని వేడుకుంటున్నామని అంగన్వాడీలు దండాలు పెడుతూ నిరసన తెలియజేశారు. తహాశీల్దార్ కార్యాలయ ఆవరణలో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **చాపాడు :** తహాశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. తమ డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు సమ్మెను కొనసాగించాలన్నారు. **ఖాజీపేట :**అంగన్వాడీలు పద్మావతి, దేవి, సునీత, ఆశ వర్కర్లు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీలు, ఆయాలు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** తహాశీల్దార్ కార్యాలయంలో అంగన్వాడీలు అంబేద్కర్ విగ్రహం ఎదురుగా ఆటో లాగుతూ జీతాలు పెంచాలని నిరసన తెలిపారు. కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.భైరవప్రసాద్, జిల్లా కమిటి సభ్యులు ఓబులాపురం విజయమ్మ, పోరుమామిళ్ల ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు మేరి, వినోదా, దస్తగిరిమ్మ, జ్యోతిమ్మ, అంజన్నమ్మ, లీలావతి, రమాదేవి, శ్రీదేవి అంగన్వాడీలు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** తహాశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు మంజుల, సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, సిఐటియు కార్యదర్శి విజయ్ కుమార్, అంగన్వాడీ కార్యదర్శి సుబ్బలక్ష్మి, విజయ అంగన్వాడీలు పాల్గొన్నారు. **బద్వేలు :** అంగన్వాడీలు ప్రభుత్వ బెరింపు ప్రతులను దహనం చేస్తూ నిరసన తెలియజేశారు. సమ్మెకు విద్యుత్, ఐద్వా, డివైఎఫ్ఐ సంఘాలు మద్దతు తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, పట్టణ కో-కన్వీనర్లు పిసి.కొండయ్య, రాజగోపాల్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని, నాయకులు అదిల్, ఇమ్మనియల్, ఐద్వా మహిళా సంఘం నాయకులు నాగమ్మ, అంగన్వాడీ ప్రాజెక్ట్ నాయకులు సుభాషిని, ఉషానమ్మ, కళావతి, తులసమ్మ, విజయమ్మ, శోభా దేవి, సుభద్ర, జయప్రదమ్మ, రాధమ్మ రత్నమ్మ కె.వి సుభాషిని ,వాణి వసంత సరోజనమ్మ వందలాదిమంది అంగన్వాడీలు పాల్గొన్నారు.

పులివెందుల : సర్వమత ప్రార్థనలు చేస్తున్న అంగన్వాడీలు

బద్వేలు : బెదిరింపు ప్రతులు దహనం చేస్తున్న అంగన్వాడీలు

ప్రభుత్వ దిష్టిబొమ్మతో శవయాత్ర

- కళ్లకు గంతలు కట్టుకుని, పొర్లు దండాలు పెడుతూ మున్సిపల్ కార్మికుల నిరసన
- 10వ రోజూ కొనసాగిన సమ్మె

కడప : ప్రభుత్వ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-కడప అర్బన్

మున్సిపల్ కార్మికులు సమ్మెలో భాగంగా పదవ రోజు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ శవయత్రచేస్తూ తమ నిరసన తెలిపారు. గురువారం ఫెడరేషన్ నాయకులు శ్రీరామ్ అధ్యక్షతన శవయాత్ర చేపట్టారు. ముఖ్యఅతిథిగా వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ హాజరయ్యారు. డివైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు తమ సంఘం తరపున మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మె మొదలై 10 రోజుల అవుతున్న కార్మికులు ఎంతో ఓపికతో శాంతియుతంగా తమ నిరసనను తెలియ జేస్తున్నారని పేర్కొన్నారు. వారేమీ గొంతుమ్మె కోరికలు కోరడం లేదని చెప్పారు. సిఎం జగన్ మోహన్‌రెడ్డి సాక్షాత్తు అసెంబ్లీ సాక్షిగా అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ తేడా అంటూ ఏమీ లేదని, చేసే పని ఒకటైనప్పుడు జీతం ఇచ్చే విషయంలో తేడాలు ఎందుకని, మా ప్రభుత్వం వస్తే అందరినీ రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. నాలుగున్నర సంవత్సరాలుగా ఎదురుచూసి, పలు ఆందోళనలు, సమ్మెలు, చర్చలు జరిగాయని చెప్పారు. ఇచ్చిన హామీలను నిలుపుకోమని రోడ్లపైకి వచ్చి శాంతియుతంగా ధర్నా, నిరవధిక సమ్మె చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండివైఖరి వీడి కార్మికుల న్యాయమైనడిమాండ్ లు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సుంకర రవి, కంచుపాటి తిరుపాల్, గోపి, కిరణ్, శ్రీధర్ బాబు, నాగరాజు, ఆదాం, వై.రమేష్, సి. కొండయ్య, దస్తగిరమ్మ, కొండమ్మ ధరణి వాటర్ సెక్షన్, ఎలక్ట్రిసిటీ, ఇంజినీరింగ్ కార్మికులు పాల్గొన్నారు. **బద్వేలు :** మున్సిపల్ కార్మికులకు జగనన్న ఇచ్చిన హామీలు అమలు చేయాలని పురపాలక సంఘ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. కార్మికుల సమ్మెకు మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ, నాయకులు మహబూబ్ బాషా, కె.వి.సుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, యానాదిరెడ్డి, ఎస్ఎం.బాష, వెంకటయ్య సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా విజయమ్మ మాట్లాడుతూ సిఎం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె విరమణకు అవసరమైన చర్యలు చేపట్టి కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. మాట తప్పి మడమ తిప్పడం సిగ్గుచేటని, కార్మికులు చేస్తున్న సమ్మెను విచ్ఛిన్నం చేయుటకు చేపట్టిన చర్యలను మానుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని, నాయకులు జివి రమణారెడ్డి, ఆదిల్ యూనియన్ పట్టణ అధ్యక్షులు పులి శ్యాం ప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు దియ్యాల హరి, ఉపాధ్యక్షులు దియ్యాల దేవమ్మ, గంటా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి దియ్యాల నాగేంద్రబాబు, కార్యదర్శులు నాగరపు సత్యరాజు, బద్వేల్ ప్రవీణ్ కుమార్, నేలటూరు పాలయ్య, కోశాధికారి కాలువ శివకుమార్ కమిటీ సభ్యులు పద్మిశెట్టి రామయ్య, ఇండ్ల చంద్రశేఖర్, తేళ్ల కిరణ్ పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** కార్మికుల సమ్మెకు కాంగ్రెస్ పార్టీ ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి నజీర్ కార్మికుల ధర్నా శిబిరానికి వచ్చిన మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ సమ్మతమైన కార్మికుల సమస్యలను ప్రభుత్వం అంగీకరించి సమ్మెకు ముగింపు పలకాలని పేర్కొన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు విజయకుమార్, మున్సిపల్ కార్మిక సంఘ గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయకుండా మొండికేస్తున్న ప్రభుత్వం పేదలకిచ్చే సంక్షేమ పథకాలు మున్సిపాల్టీ తదితర కార్మికులకు రద్దు చేయడం శోచనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ కార్యదర్శి సాల్మన్, అధ్యక్షులు చంటి, కోశాధికారి రాఘవ, సహాయ కార్యదర్శులు రవికుమార్, మోహన్, ఉపాధ్యక్షులు గుర్రమ్మ, రమాదేవి, ప్రమీలమ్మ, నీతమ్మ, అన్నపూర్ణ, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

బద్వేలు : కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ప్రొద్దుటూరు : పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న కార్మికులు

ఉద్యోగులను వేధిస్తే పుట్టగతులుండవు : యుటిఎఫ్

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

ప్రజాశక్తి-కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులను వేధిస్తే ప్రభుత్వానికి పుట్టగతులుండవని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు హెచ్చరించారు. గురువారం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కలెక్టరేట్ ఎదుట ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు 12 గంటల పాటు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలన్నింటిని తక్షణం పరిష్కరిస్తానని హామీ ఇచ్చి, ఉద్యోగుల అండదండలతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిట్ట నిలువునా మోసం చేశారని ఆరోపించారు. ఈ నాలుగున్నరేళ్ళ కాలంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒనగూరిందేమీ లేదన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన పిఆర్సీ, డిఎ, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకపోగా ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్ఐ సొమ్మును సైతం కాజేసి ప్రభుత్వ అవసరాలకు మళ్లించారన్నారు. ఉద్యోగులు తమ పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, గృహ నిర్మాణాల ఖర్చుల కోసం రుణాలకు దరఖాస్తు చేస్తే సంవత్సరాల తరబడి చెల్లింపులు లేవన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల తుది చెల్లింపులను సైతం ఈ ప్రభుత్వం చేయడం లేదంటే ఉద్యోగ, ఉపాధ్యాయులను ఏ స్థాయిలో వేధింపులకు గురి చేస్తున్నదో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి భేషుగ్గా ఉందని ఒకపక్క రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తూనే మరోపక్క ఉద్యోగులకు ఒకటో తేదీ జీతాలు కూడా చెల్లించడం లేదన్నారు. సంక్షేమ పథకాలను బటన్ నొక్కడం ద్వారా అమలు చేస్తున్నామని ప్రకటించుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల బకాయిల బటన్ ఎందుకు నొక్కడం లేదని నిలదీశారు. 2023 జూలై 1వ తేదీ నుండి నూతన పిఆర్సీని అమలు చేయాల్సి ఉండగా కమిషన్ ను నియమించిందే తప్ప, విధి విధానాలు రూపొందించి అమలు చేసిన పాపాన పోలేదన్నారు. వెంటనే పిఆర్సీని అమలు చేయాలని, ఈలోపు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించి అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. బకాయిల చెల్లింపు విషయంలో ప్రభుత్వం దిగిరాకపోతే జనవరి 9, 10 తేదీలలో విజయవాడలో 36 గంటల ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి ఎ.రామ్మోహన్, ప్రముఖ కవి చెన్నకేశవులు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సునీల్ కుమార్, రాష్ట్ర నాయకులు సగిలి రాజేంద్ర ప్రసాద్ ధర్నాకు మద్దతు తెలిపి ప్రసంగించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎన్.నాగార్జున రెడ్డి, సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాత రాణి, ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు డి.వి.రవీంద్రుడు, సి.శ్రీనివాసులు, కె.చెన్నయ్య, సి.వి.రమణ, కె.మురళీకృష్ణ, ఎల్.చంద్ర ఓబుళ్‌రెడ్డి, ఎ.శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్.ఓబుల్ రెడ్డి, డి.రూతు ఆరోగ్య మేరీ, ఆడిట్ కమిటీ జిల్లా కన్వీనర్ ఎం.ప్రభాకర్, సిపిఎస్ జిల్లా కన్వీనర్ సి.సుదర్శన్, కో కన్వీనర్స్ కె.గంగయ్య, ఎల్.కరీముల్లా, బి.వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

8న ఉపన్యాస పోటీలు

ప్రజాశక్తి-కడప అర్బన్ : మై భారత్ - వికసిత భారత్ ఏ 2047 అనే అంశంపై ఈ నెల 8న ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వాతంత్రం పొందిన 100వ సంవత్సరం నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశం, ఆర్థిక వృద్ధి, సామాజిక పురోగతి, సహా అభివృద్ధి, పర్యావరణ స్థిరత్వం, సుపరిపాలన, భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా ఎలా తయారు చేయాలనే దానిపై సమాజం వారి ఆలోచనలను వీటిపై ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలలోని 18-29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత ఈ పోటీలలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో గెలుపొందిన విజేతకు నగదు బహుమతి తోపాటు రాష్ట్ర స్థాయిలో పాల్గొనాలని తెలిపారు. రాష్ట్ర స్థాయి మొదటి బహుమతి రూ.లక్ష, రెండవ బహుమతి, రూ.50 వేలు, మూడవ బహుమతి రూ.25 వేలు నగదు బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 8వ తేదీన యూత్ హాస్టల్ మీటింగ్ హాల్, యూత్ హాస్టల్ బిల్డింగ్, బాలాజీ నగర్ రోడ్ నంబర్-13లో నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని యువత సద్వినియోగించు కోవాలని కోరారు. పేర్ల నమోదు కోసం ఈ క్రింది లింక్ ఉపయోగించు కోవాలని తెలిపారు.

క్రీడలతోనే ఆరోగ్యం : ఎంపిడిఒ

ప్రజాశక్తి - వల్లూరు

క్రీడలతోనే ఆరోగ్య మానసిక ఉల్లాసం సాధ్యమవుతుందని ఎంపిడిఒ జయశ్రీ పేర్కొన్నారు. గురువారం వల్లూరులోని ఆదర్శ పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బ్యాడ్మింటన్ పోటీలను ఆమె టాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వివిధ రకాల క్రీడలతో మానసిక ఉల్లాసాన్ని పొందాలని ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ క్రీడలలో పాల్గొనే విధంగా ప్రణాళికను రూపొందించామని తెలిపారు. క్రికెట్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబాడ్డీ, వాలీబాల్ తదితర క్రీడలను ప్రధానంగా నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి రామ్మూర్తి, క్రీడాకారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మున్నూరు అక్బర్

వైసిపి కంటే టిడిపినే ఎక్కువ పింఛన్లు ఇచ్చింది

- జిల్లా అధికార ప్రతినిధి మున్నూరు అక్బర్

ప్రజాశక్తి-కడప అర్బన్

జగన్ పాలన కంటే చంద్రబాబు పాలనలో 7 లక్షల వృద్ధాప్య, వికలాంగుల పెన్షన్లు ఎక్కుగా ఇచ్చారని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మున్నూరు అక్బర్ అన్నారు. గురువారం పాత బస్టాండ్‌లోని మున్నూరు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలోనే మొదటిగా పెన్షన్లు ప్రారంభానికి శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. విభజన అనంతరం హామీ మేరకు జిఒ నంబరు 113 ద్వారా వ ృద్ధులకు రూ.1000, వికలాంగుల రూ.1500 ఒకే దఫాలో పెంచామని ఇదే ప్రజల పట్ల తెలుగుదేశం ప్రభుత్వానికి, చంద్రబాబు నాయుడుకి ఉన్న చిత్తశుద్ధి అని పేర్కొన్నారు. మళ్ళీ 2018, డిసెంబర్‌లో ఒకే దాఫాలో రూ.2000, వృద్ధాప్య పెన్షన్లు పెంచారన ఈ మేరకు జిఒ నంబరు13ను విడుదల చేశారని పేర్కొన్నారు. ఆ రోజుటికి రాష్ట్రంలో 54.6 లక్షలు పైన పెన్షన్ లు ఇచ్చారని, నెలకు రూ.1107.32 కోట్లు అవసరమని అప్పటి ఉన్నత అధికారులు ఉత్తర్యులు జారీ చేశారని ఇది వాస్తవమని తెలిపారు. టిడిపి ప్రభుత్వం హయంలోనే ట్రాన్సజెండర్ పెన్షన్లు, గిరిజనుల్లో ఒక తెగకు చిన్న వయస్సులోనే ముసలితనంతో బాధపడుంటే వారికి 50 సంవత్సరాలకే పెన్షన్లు వర్తింప చేశామని గుర్తు చేశారు. సమావేశంలో నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు నాదెండ్ల దస్తగిరి, మైనారిటీ నాయకులు రాజంపేట అబ్దుల్ సలాం, నాగూర్, నజీర్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వ బాలికల కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం రవీంద్ర నగర్‌లో స్పెషల్ క్యాంపును నిర్వహించారు. ఈ నెల 4వ తేదీ నుంచి వారం రోజులు పాటు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజున రవీంద్ర నగర్ ప్రాథమిక పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ సూర్యా రావు అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు స్పెషల్ క్యాంపు గురించిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం, జమాల్ హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ మురాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేంద్రబాబు, ఉర్దూ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిబి జాన్ హాజరయ్యారు. విద్యార్థులకు స్పెషల్ క్యాంపు పై అవగాహన కల్పించారు. అనంతరం ఫాతిమా మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించబడిన హెల్త్ క్యాంపు లో ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు పాల్గొని వచ్చిన రోగులకు అవసరమైన సహాయం అందించారు. ఇందులో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు గోవిందరెడ్డి, షకీల బేగం, కళాశాల అధ్యాపకులు భరత్ కుమార్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ క్యాంపులో వాలంటీర్లు

ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చింతాకొమ్మదిన్నె

ఆరోగ్యశ్రీ పరిమితి పెంచినట్టు కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ ఆవరణలో నూతన ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని ప్రతి కుటుంబానికి రూ.ఐదు లక్షల నుండి రూ.25 లక్షలకు పెంచుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంచడం తనకెంతో ఆనందం తెచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎంపిడిఒ జి.రవికుమార్‌రెడ్డి, పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కె.రాఘవేంద్ర, డాక్టర్ సునీత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి

బద్వేలులో జంట హత్యల కలకలం

- అల్లరి మూకల ఘర్షణలో అన్నదమ్ములు మృతి

ప్రజాశక్తి-బద్వేలు

పట్టణంలో జంట హత్యలు కలకలం రేపాయి. స్థానిక సిద్ధవటం రోడ్డు ఎరుకలవీధి సమీపంలో గురువారం రెండు గ్రూపుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు ప్రాణాలు కోల్పోయారు. వివరాలలోకి వెళ్తే.. గత ఏడాది డిసెంబర్ 31వ తేదీ రాత్రి జరిగిన ఒక చిన్న ఘటనే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఆ విషయమై గురువారం ఉదయం మార్కెట్ యార్డ్ వద్ద చిన్నపాటి గొడవ జరిగింది. అనంతరం లకిడి విజయ్ కుమార్ కుమారులు ప్రమోద్ కుమార్, తరుణ్ కుమార్ తన స్నేహితులతో కలిసి ఆటోలో వెళ్తూ మార్గ మధ్యలో తారసబడిన పసుపులేటి సాయికుమార్(33), ప్రశాంత్(30) అనే అన్నదమ్ములను అందరూ చూస్తుండగానే కత్తితో పొడిచి చంపారు. ఈ ఘటనలో గాయాలపాలైన ప్రమోద్ కుమార్, తరుణ్ కుమార్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వారు మృతి చెందారు. విషయం తెలుసుకున్న బద్వేల్ అర్బన్ సిఐ యుగంధర్ నిందితులను అదుపులోకి తీసుకుని సంఘటనకు గల కారణాలను విచారిస్తున్నారు. మృతులు ఇద్దరూ వివాహితులు కాగా అన్నకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కలదు. ఆస్పత్రి వాతావరణంలో భార్యాపిల్లల రోదనలు పలువురిని చలింపచేశాయి. ఒకే కుటుంబంలో అన్నదమ్ములు చనిపోవడంతో గాంధీనగర్ వీధిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

హత్యకు గురైన అన్నదమ్ములు ప్రశాంత్, సాయికుమార్

ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ యుగంధర్ తెలిపారు. బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమణ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మృతుని కుటుంబానికి తప్పకుండా న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. పెత్తందార్లకు అన్యాయం జరుగుతే గొంతెత్తి మాట్లాడే ఈ సమాజం బిసికి చెందిన ఇద్దరు యువకులను నరిరోడ్డుపై అతి కిరాతకంగా పొడిచి చంపితే ఎటువంటి స్పందన లేకపోవడం చాలా సోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు.

బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రికార్డులు తనిఖీ చేస్తున్న జెసి గణేష్‌కుమార్

ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని ప్రజలకు సక్రమంగా పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం వేంపల్లెలోని బియ్యం సరఫరా గౌడన్, రేషన్ షాపులను జెసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పేదలకు ఇచ్చే బియ్యం పంపిణీలో ఎలాంటి అవినీతి చేయరాదని డీలర్లకు సూచించారు. సకాలంలో లబ్ధిదారులకు బియ్యం సరఫరా చేయాలని చెప్పారు. బియ్యం పంపిణీపై లబ్ధిదారుల నుండి ఎలాంటి పిర్యాదులు రాకుండా చేసుకొనే బాధ్యత డీలర్లుపైనే ఉందన్నారు. ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం అందించే సరుకులు ఇవ్వాలని సూచించారు. లోటుపాట్లును సరిదిద్దుకోవాలని చెప్పారు. అనంతరం ఆయా ప్రాంతాల్లోని డీలర్ షాపుల్లోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఐ లోకేష్, విఆర్ఒలు, డీలర్లు పాల్గొన్నారు.

వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరడం హర్షణీయం

- ప్రోగ్రెసివ్ ఫౌండేషన్ అధ్యక్షులు చాపాటి రామసుధాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - చాపాడు



వైఎస్ఆర్‌టిసి పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయడాన్ని స్వాగతిస్తున్నానమని ప్రోగ్రెసివ్ ఫౌండేషన్ అధ్యక్షులు చాపాటి రామ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ అనేక ఆటుపోట్లను ఎదుర్కొని జీవితాంతం కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతూ ఆ పార్టీని అధికారంలోకి తెచ్చి తను ముఖ్యమంత్రిగా డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు ఇప్పటికీ ప్రజల మదిలో గుర్తున్నాయన్నారు. సమకాలీన దేశ రాజకీయ వాతావరణంలో వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీని బలోపేతం చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ప్రకటించడం అభినందనీయమన్నారు. షర్మిలతోపాటు కాంగ్రెస్ పార్టీకి కలిసి వచ్చే నాయకులు కూడా త్వరపడి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

జమ్మలమడుగు రూరల్ : షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని స్వాగతిస్తున్నామని జమ్మలమడుగు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులైన మర్రి ప్రకాశం, పాలాజీ చిన్న వెంకటస్వామి అన్నారు. గురువారం స్థానిక పాత బస్టాండ్‌లో

మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వారు మాట్లాడుతూ దేశంలో బిజెపిని కొట్టగలిగిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. బిజెపి అరాచక పాలనను దేశంలోని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు మేలు జరిగేది ఒక కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని కొనియాడారు. షర్మిల రాకతో పార్టీ బలోపేతమై కేంద్ర నాయకత్వంలోని రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసే దిశగా ఎపిలో ప్రతి కార్యకర్త పనిచేయాలని కోరుకుంటున్నారని అందులో తాము భాగస్తులమని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెస్ కె.ప్రసాద్, గండ్లూరు చంద్ర, పాల్గొన్నారు.

మాజీ మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన బిసి నాయకులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మాజీ మంత్రి కొల్లు రవీంద్రతో బిసి నాయకులు

తెలుగుదేశం పార్టీ నాయకుడు, మాజీ మంత్రి కొల్లు రవీంద్రను కడప జిల్లా బిసి సెల్ నాయకులు కలిశారు. గురువారం విజయవాడలో జరిగిన టిడిపి బిసి సెల్ సమావేశానికి జిల్లా పార్లమెంట్ బిసి సెల్ ఉపాధ్యక్షుడు మురళీమోహన్ యాదవ్, వేంపల్లికి చెందిన నాగభూషణం ఇతర నాయకులు కలిశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారని నాయకులు తెలిపారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు తప్పక గుర్తింపు ఉంటుందని కొల్లు రవీంద్ర పేర్కొన్నారన్నారు.

మునిగిపోయే పడవ వైసిపి

ప్రజాశక్తి - దువ్వూరు

మండల పరిధిలోని కానగూడూరు గ్రామంలో పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ మంచి ఆదరణ పొందుతోందన్నారు. ప్రజలకు ఎంతో మేలు చేసేది టిడిపి అని ఆయన కొనియాడారు. వైసిపి ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఎక్కువైందన్నారు. సామాన్య ప్రజలు, రైతులు కూడా ఈ ప్రభుత్వం ఎప్పుడు పోతుందా అనే భావనతో ఉన్నారని తెలిపారు. 2024లో వైసిపి మునిగిపోయే పడవని ఆయన పేర్కొన్నారు. టిడిపి మినీ మేనిఫెస్టో వివరిస్తూ.. ఒక్కసారి అవకాశం ఇస్తే ప్రజలకు సేవ చేసే భాగ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బోరేటి రమణారెడ్డి, రైతు నాయకుడు కారపురెడ్డి సంజీవరెడ్డి, తహశీల్దార్ హుస్సేన్, నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు అభివాదం చేస్తున్న పుట్టా సుధాకర్ యాదవ్

టిడిపిలో 75 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - పెద్దముడియం

మండలంలోని జె. కొట్టాలపల్లె గ్రామంలో జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భూపేష్ సుబ్బరామిరెడ్డి సమక్షంలో గురువారం 75 కుటుంబాల వైసిపి నుంచి నాయకులకు టిడిపిలో చేరారు. వీరికి భూపేష్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో యనమల కృష్ణారెడ్డి, గడ్డం శేఖర్ రెడ్డి, సగిలి రఘునాథరెడ్డి, విజయ రాంరెడ్డి, బాషా, వెంకట్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డితోపాటు పలువురు ఉన్నారు. ఈ సందర్భంగా భూపేష్ సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి విఫలమయ్యారని తెలిపారు. ఆయన పిచ్చి తుగ్లక్ పాలనతో ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్న రోజుల్లో వైసిపి పూర్తిగా ఖాళీ అవుతుందని ఆయన తెలిపారు. ప్రజలందరూ ఈ సైకో పాలన నుండి విముక్తి పొందటానికి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించాలని భూపేష్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శివనాథ్ రెడ్డి, చంద్రమౌళి రెడ్డి, శివారెడ్డి, మస్తాన్, పేతురు, వంగళ బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రామసుబ్బా రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.

నేడు టిడిపిలో పలువురు చేరిక

ఖాజీపేట : వైసిపి నుంచి తెలుగుదేశం పార్టీలోకి పెద్ద ఎత్తున నాయకులు శుక్రవారం చేరనున్నారు. మండల పరిషత్ మాజీ ఉప మండలాధ్యక్షుడు. భాస్కర్‌రెడ్డితోపాటు మరికొందరు టిడిపిలో చేరను న్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి మైదుకూరు టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ రానున్నారని తెలిపారు. టిడిపి శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్దఎత్తున తరలి వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని లక్ష్మిరెడ్డి పిలుపునిచ్చారు.

సమస్యలు ఎప్పటికి తీరేనో..!

అధ్వానంగా రోడ్లు, కాలువలు - కాలయాపనలో అధికారులు - పట్టని ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల గ్రామపంచాయతీ నుండి నగర పంచాయతీగా రూపాంతరం చెంది దాదాపు 12ఏళ్లవుతోంది. నగర పంచాయతీ అయినప్పటినుండి పన్నులు మాత్రం ప్రజల వద్ద ముక్కుపిండి వసూలు చేస్తున్నారే తప్ప, వారి సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. ఎన్నికలు వచ్చేసరికి ఎక్కడాలేని హామీలతో ప్రజలను మభ్యపెడుతూ ప్రజాప్రతినిధులు తమ ఓటు బ్యాంకును పెంచుకుంటున్నారే కానీ, చివరికి ప్రజలకు ఒరిగిందేమీ లేదని పలువురు పేర్కొంటున్నారు. పారిశ్రామిక వాడగా ఎంతో గుర్తింపు పొందిన ఎర్రగుంట్ల నగర పంచాయతీలో వర్షం పడితే మోకాటి లోతు నీళ్లతో ఇప్పటికీ రోడ్లు దర్శనమిస్తున్నాయి. పట్టణం లోని పలు వీధుల్లో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. పట్టణంలో ప్రధానంగా కాలువలు లేకపోవడంతో వీధుల లోని వర్షపు నీరు, ఇళ్లలోని మురుగునీరు రోడ్ల వెంబడి ప్రవహిస్తోంది. ఎత్తుపల్లాల వద్ద నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. ఎన్నికల సమ యంలో పలు పార్టీల ప్రజా ప్రతినిధులు అధ్వా నంగా ఉన్న రోడ్ల పరిస్థితులు చూసి అధికా రంలోకి రాగానే రోడ్లు వేస్తాం.. డ్రయినేజీ కాలు వలు వేస్తామని హామీలు ఇచ్చారని స్థానికులు అంటున్నారు. కానీ ఇప్పటికీ పది ప్రాంతాల్లో సమ స్యలు అలానే ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. పట్టణంలో ప్రధానంగా టవర్ వీధి, పుష్పగిరి మాన్యం, నాలుగు రోడ్ల కూడలి నుండి సాయిబాబా గుడికి పోవు ఎర్రగుడిపాడు రస్తా, కటిక బజార్,

గుంతలమయంగా టవర్ వీధి రోడ్డు

పోలీస్‌స్టేషన్ వెనుకవైపు వీధులు ఇలా చెబుతూపోతే పట్టణంలో చాలా వీధుల్లో రోడ్ల సమస్యలతో ప్రజలు అల్లాడు తున్నారు. సమస్య ఉన్న ప్రాంతాల్లో రోడ్లు, డ్రయినేజీలు వేయకపోగా ప్రజాప్రతినిధులు కాంట్రాక్టర్ల కోరిక మేరకు వారికి ఇష్టం వచ్చిన చోట రోడ్లు వేసి బిల్లులు చేసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రణాళికాబద్ధంగా సమస్యాత్మక ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు పూర్తిగా వేయాలి..

పట్టణంలోని ఎర్రగుడిపాడు రస్తా ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. సాయిబాబా గుడి వద్ద నుండి మహేశ్వర్ నగర్ వీధి వద్దకు కొన్ని నెలల క్రితం నూతన రోడ్డు నిర్మించారు. ప్రస్తుతం అక్కడి నుండి కాకుండా మధ్యలో కొద్ది భాగాన్ని రోడ్డు నిర్మాణం కోసం ప్రజాప్రతి నిధులు, అధి కారులు భూమి పూజ చేశారు. అలా వేయడం వల్ల మధ్యలో ఉన్న మా ఇళ్ల వద్ద నీరు నిలుస్తోంది. ఈ కారణంగా సమస్య తీరకపోగా మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంది. అలా మధ్యలో అరకొరగా కాకుండా రోడ్డు పూర్తిగా నిర్మాణం చేపట్టాలి.

- కొట్లూరు బాషా, స్థానికుడు, ఎర్రగుంట్ల

ప్రణాళికలు సిద్ధం చేశాం..

పట్టణంలో సమస్యాత్మక ప్రాంతాల్లోని రోడ్లు, కాలు వలు గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేశాం. రూ.36 లక్షలతో టవర్ వీధి రోడ్డు, రూ.15 లక్షలు ఎంపీ నిధులతో పోలీస్‌స్టేషన్ వెనుక వీధిలో డ్రయినేజీ కాలువ, రూ.15 లక్షలు గడపగడపకూ నిధులతో పుష్పగిరి మాన్యం రోడ్డు, రూ.12.5 లక్షల గడపగడపకూ నిధులతో ఎర్రగుడిపాడు రస్తాలో కొద్ది భాగం రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. అనుమతుల కోసం ఉన్నతాధికారులకు పంపాం. త్వరితగతిన రోడ్లు, కాలువలు నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

- జగన్నాథ్, మున్సిపల్ కమిషనర్

'భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలి'

ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ నేతలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

భూ యాజమాన్య హక్కు చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సి.నారాయణరెడ్డి, మురళీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కోర్టు వద్ద నుండి ర్యాలీగా పాత బస్టాండు గాంధీ సర్కిల్ చేరుకుని మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వరకు ర్యాలీని కొనసాగించి ఆర్‌డిఒ జి.శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ నేతలు మాట్లాడుతూ ఈ చట్టం వల్ల ప్రజలకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ అధికారులే భూ యజమాని ఆదేశం లేకుండా ఇంకొకరికి భూమిని రాసిచ్చే అవకాశం కూడా ఉందన్నారు. రాజ్యాంగ వ్యతిరేక చట్టమని అందుకు ప్రజలందరూ ఏకమై ఉద్యమంలో భాగస్వాములు కావాలన్నారు. ఆర్‌డిఒ శ్రీనివాసులు మాట్లాడుతూ వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం, పులివెందుల బార్ అసోసియేషన్ నేతలు, సీనియర్ న్యాయవాదులు మునిసుబ్బారెడ్డి, సి.సుబ్బారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పెద్దిరాజు, పాలాజి రవి, రామ్మోహన్, నాగార్జునరెడ్డి, ఓబులేసు పాల్గొన్నారు.

అవినీతి నిరూపిస్తే రాజకీయాలకు స్వస్తి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

తాను కానీ తన కుటుంబ సభ్యులుకానీ ఒక్క అవినీతి చేసినట్లు నిరూపిస్తే రాజకీయాలు మానుకుంటానని టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సవాల్ విసిరారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి గతంలో కామనూరు గ్రామంలో అక్రమంగా ఇసుక అమ్ముతున్నారని వరదరాజులరెడ్డి తమ్ముడు రాఘవరెడ్డిపై ఆరోపణలు చేసిన నేపథ్యంలో.. ఎమ్మెల్యే రాచమల్లు తన తమ్ముడిపై దుర్భాషలాడడం తగదని వరద అన్నారు. స్థానిక తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతు కామనురు గ్రామంలోని కుందూ నదిలో అక్రమ ఇసుక రవాణా చేస్తున్నామని ఎమ్మెల్యే రాచమల్లు అవాస్తవాలు చెబు తున్నారన్నారు. కుందూ నదిలో ఇసుక రవాణా చేస్తున్న వాహనాల వద్ద గ్రామ కమిటీ వారు రూ.300 వసూలు చేస్తారని, గ్రామాభివృద్ధి కమిటీ ద్వారా పలు దేవాలయాలు, ఆసుపత్రి, పాఠశాల అభివృద్ధికి నిధులు ఉప యోగించి ప్రజలకు సేవ చేశామన్నారు. తన తమ్ముడు రాఘవరెడ్డి పైసా కూడా దుర్వినియోగం చేయలేదన్నారు. అలాంటి వ్యక్తిని చులకనగా మాట్లా డడం తగదని వరద హెచ్చరిం చారు. 70 ఏళ్ల వయసున్న తన తమ్ముడు రాఘవరెడ్డిని వాడు వీడు అని ఎమ్మెల్యే మాట్లాడడం సభ్యత కాదన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు తన ఊరిలో బతకలేక ప్రొద్దుటూరుకు వలస వచ్చారన్నారు. ఎమ్మెల్యే అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నాడని ఆరోపించారు. ఇకపై తనపైగాని, తన నాయకులపై, కార్యకర్తలనుగానీ దుర్భాషలు అడిగితే సహించేది లేదని వరద హెచ్చరించారు. కార్యక్ర మంలో సర్పంచ్ గౌస్, మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

రాజధానిని అతలాకుతలం చేసిన జగన్

ప్రొద్దుటూరు : రాష్ట్ర విభజన అనంతరం చంద్రబాబు హయాంలో అందంగా తయారవుతున్న రాజధాని ప్రాంతాన్ని ముఖ్యమంత్రి జగన్ తన మూర్ఖపు ఆలోచనలతో అతలాకుతం చేశారని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా వరద గురువారం 32వ వార్డు వసంతపేట ఊటుకూరు వీరయ్య మట్టమడి వీధుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ముందస్తు మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు నంద్యాల కొండారెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, టిడిపి కడప పార్లమెంట్ కార్యదర్శి సిద్దారెడ్డి, నాగమునిరెడ్డి, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటసాల వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

వచ్చే సాధారణ ఎన్నికలు నియోజకవర్గంలో ప్రశాంతంగా జరగాలని జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ అధికారి జిశ్రీనివాసులు కోరారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలోని సభాభవనంలో గురువారం ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ నియోజకవర్గంలోని 315 పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేవా అనేది పరిశీలించాలన్నారు. ఏవైనా కొరత ఉంటే వెంటనే సంబంధిత తహశీల్దార్ సమకూర్చాలన్నారు. ఒక్కో రూట్ ఆఫీసర్‌కు ఎనిమిది నుంచి పది పోలింగ్ కేంద్రాలను కేటాయించామన్నారు. అక్కడి సమస్యలను గుర్తించి తనకుగానీ తహశీల్దార్ దృష్టికిగానీ తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నియోజవర్గంలోని తహశీల్దార్లు, పోలింగ్ కేంద్రాల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు తీర్చాలని ఆశా వర్కర్లు ధర్నా

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

తమ సమస్యలు తీర్చాలని మండలంలోని ఆశా వర్కర్లు గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బైఠాయించి ధర్నా చేశారు. సిఐటియు, ఎఐటియుసి, టిడిపి, సిపిఎం నాయకులు, అంగన్వాడీ యూనియన్ నాయకులు వారికి మద్దతు తెలిపారు. ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు సరళ, చిన్న ఓబులమ్మ మాట్లాడుతూ 17ఏళ్లుగా రాష్ట్రంలోని గ్రామ, పట్టణాల్లో గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులు, పలు రకాల రోగిగ్రస్తులకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. అయినా ఆశా వర్కర్లకు ఎలాంటి వేతనాల పెంపు, సెలవులు, ఉద్యోగ భద్రత, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం, కనీసం కార్మికులుగా గుర్తింపు లేకుండా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆశా కార్యకర్తల డిమాండ్లు నెరవేర్చాలన్నారు. లేకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో సిపిఎం బయన్న, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు చాంద్‌బాషా, టిడిపి నాయకులు సంజీవరెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, కొండారెడ్డి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు పార్వతి, ఉమా పాల్గొన్నారు.

8న అప్రెంటీస్ అభ్యర్థులకు శిక్షణ

ప్రజాశక్తి - కడప సిటీ

అప్రెంటీస్‌షిప్‌నకు ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 8న కర్నూలు జోనల్ ట్రైనింగ్ కళాశాలలో శిక్షణ ఉంటుందని జిల్లా ప్రజా రవాణా అధికారి పి.గోపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న ఉదయం తొమ్మిది గంటలకు డీజిల్, మోటార్ మెకానిక్స్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, మెషనిస్ట్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మాన్ అభ్యర్థులు కర్నూలులోని జోనల్ ట్రైనింగ్ కాలేజిలో హాజరుకావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఒరిజినల్ టెన్త్, ఐటిఐ సర్టిఫికెట్లతోపాటు కులధ్రువీకరణ పత్రం, బ్యాంకు అకౌంట్ పాసు పుస్తకం, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు అన్ని కలిపి మూడు సెట్ల జిరాక్స్ కాపీలతో తప్పక హాజరు కావాలని ఆయన సూచించారు.

వేంపల్లె వాసికి నియోనటాలజీలో సీటు

ప్రజాశక్తి - వేంపల్లె

డాక్టర్ భరద్వాజ్‌రెడ్డి

వేంపల్లె వాసి డాక్టర్ భరద్వాజ్‌రెడ్డి మధురై ప్రభుత్వ రాజాజీ మెడికల్ కాలేజీలో డిఎం (నియోనటాలజీ) సీటును సాధించారు. వేంపల్లెకి చెందిన పి.రాజగోపాల్ రెడ్డి, సుజాత కుమారుడైన డాక్టర్ భరద్వాజ్ రెడ్డి ఎంసెట్ లో 1215వ ర్యాంకు సాధించి కడప రిమ్స్‌లో మెడికల్ సీటు సాధిం చి ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ఏలూరు ఆశ్రమం మెడికల్ కాలేజీలో ఎండి పిడియాట్రిక్ పూర్తి చేసి మధురై ప్రభుత్వ రాజాజీ మెడికల్ కాలేజీలో నియోన టాలాజీ విభాగంలో సీటును సాధించారు. దీంతో డాక్టర్ భరద్వాజ్‌రెడ్డి తల్లిదండ్రులైన రాజగోపాల్‌రెడ్డి, సుజాత ఆనందం వ్యక్తం చేశారు. తమ కుమారుడు మధురై ప్రభుత్వ రాజాజీ మెడికల్ కాలేజీలో నియోనటాలాజీ విభాగంలో సీటు సాధించడం గర్వంగా ఉందన్నారు. కష్టపడితే ఏదైనా సాధించవచ్చు అనేది డాక్టర్ భరద్వాజ్‌రెడ్డి నిరూపించాడని తెలిపారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక రాజీవ్ నగర్ కాలనీలోని మదర్ థెరిస్సా అనాథ ఆశ్రమంలోని వృద్ధులకు వికాస్ పాఠశాల విద్యార్థులు, కరస్పాండెంట్ రఫియా ఆధ్వర్యంలో గురువారం దుప్పట్లు, పండ్లను ఆశ్రమ నిర్వాహకులు సుబ్బయ్య సమక్షంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రఫియా మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సేవా గుణాన్ని అలవర్చుకోవడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు దుప్పట్లను పంపిణీ చేయడం పట్ల ఆశ్రమ నిర్వాహకులు సుబ్బయ్య ఆనందాన్ని వ్యక్తపరిచారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బాషా, ఆబిద, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్యాపకురాలి మృతి బాధాకరం

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకురాలుగా పని చేస్తున్న అస్మా సిద్దిక ఆకస్మిక మృతి బాధకరమని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. ఆ మేరకు గురువారం డిగ్రీ కళాశాల ఆవరణలో ఆస్మా సిద్దిక చిత్ర పటానికి అధ్యాపకులు, విద్యార్థులు నివాళు లర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, కళాశాల అధ్యాపకులు డాక్టర్ నాగలక్ష్మి, డాక్టర్ ఓబుల్‌రెడ్డి, గంగాధర్, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పెన్షన్ ఇస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

హామీలను నెరవేర్చిన జగన్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఖాజీపేట

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాటి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో గురువారం పెన్షన్ రూ.3వేలు పెరిగిన మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే, వైసిపి మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి హాజరయ్యారు. ఎంపిపి అబూబకర్ సిద్దిక్ అధ్యక్షతన నిర్వహించగా, జడ్పీ కోఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా, ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, బిఎంబి బాషా, మండలం పరిషత్ కోఆప్షన్ సభ్యులు మున్వర్ హుస్సేన్, కొత్తపేట గోపాల్‌రెడ్డి, వైసిపి జిల్లా కార్యదర్శి నాగిరెడ్డి, దుంపలగట్టు సర్పంచ్ రెడ్యం రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో భాగంగా నూతన సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా పెన్షన్ రూ.3వేలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి లబ్ధిదారులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. కొత్తపల్లి పంచాయతీ సచివాలయ కార్యాలయంలో గురువారం సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి 61 మంది లబ్ధిదారులకు నూతన పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో కలిసి సర్పంచ్ సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో యువ నాయకుడు 13వ వార్డు మెంబర్ కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, వార్డు మెంబర్లు ఇస్మాయిల్, వెంకటసుబ్బయ్య, సాబీర్, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బి.కోడూరు : మండలం కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధా మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అర్హులైన ప్రతి అవ్వ తాతలకు జనవరి నుండి రూ.3000 పెన్షన్ అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ, ఎంపిపి రామకృష్ణారెడ్డి, జెడ్పిటిసి దావీదు, సొసైటీ ప్రెసిడెంట్ ఓ ప్రభాకర్‌రెడ్డి, మండల నాయకులు యోగానందరెడ్డి, సుబ్బారెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అర్హులైన లబ్ధిదారులకు ఇచ్చిన మేరకు పింఛన్ రూ.3000 ఇచ్చి మాట నిలుపుకున్నారని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, జెడ్పిటిసి పి.నరేన్ రామానుజులరెడ్డి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం పెంచిన పింఛన్ల పంపిణీతో పాటు, నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, కో-కన్వీనర్ కళా యాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీలు నాగరాజు, నారాయణరెడ్డి, మునయ్య, సర్పంచ్‌లు వద్దిరెడ్డి సురేంద్రరెడ్డి, స్వాతి, సుబ్బరాయుడు, వైసిపి నాయకులు, ఎంపిడిఒ రవికుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు నగదు, పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని ఏడవ కౌన్సిల్ వార్డులో గురువారం జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులోని ప్రతి గడపకు తిరుగుతూ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. వార్డులోని సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. మండల వ్యాప్తంగా నూతనంగా మంజూరైన 249 మంది లబ్ధిదారులకు రూ.3000 నగదుతోపాటు పింఛన్ పత్రాలను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, జడ్పిటీసీ తమ్మిశెట్టి బాలయ్య, కమిషనర్ జగన్నాథ్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న హృషికేశవరెడ్డి

బాలుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

స్థానిక 8వ వార్డు శబరికాలనీలోని వనం గిరి అనే పదేళ్ల బాలుడికి కుష్టు వ్యాధి, చర్మ వ్యాధి ఉండడంతో బాలుడు పెన్షన్ కావాలని దరఖాస్తు చేసుకోగా, రిజెక్ట్ అయింది. విషయం తెలుసుకున్న వైసిపి సీనియర్ నాయకులు వల్లంబాయి హృషికేశవరెడ్డి గురువారం బాలుడి ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించి, రూ.3000 అందజేశారు. గిరికి పింఛన్ వచ్చే వరకు ప్రతి నెల రూ.3000 ఇస్తానని బాలుడి తల్లిదండ్రులకు ఆయన భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా హృషికేశవరెడ్డి మాట్లాడుతూ బాలుడు పడే అవస్థ, తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి తెలుసుకొని చాలా బాధపడ్డానని తెలిపారు. సిఎం జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి స్ఫూర్తితో బాలుడికి ప్రతి నెల పెన్షన్ వచ్చే వరకు స్వయంగా ఇంటికి వెళ్లి అక్టోబర్ నెల నుండి రూ.3000 అందిస్తున్నానన్నారు. బాలుడికి త్వరగా పెన్షన్ అందేలా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ఆయన సహాయానికి స్థానికలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. కొన్నేళ్లుగా ప్రజాసేవలో అన్నదానాలు, ఆర్థిక, వైద్య సహాయాలు చేస్తున్న హృషికేశవరెడ్డి రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలిచారని ప్రజలు కొనియాడారు. కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ శ్రీరాముల చిన్న నాగన్న, వాలంటీర్ కె.చిన్నికృష్ణ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

వేంపల్లె : మండలంలోని అలిరెడ్డిపల్లె గ్రామంలో అక్రమంగా విక్రయాలు చేస్తున్న 9 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ చాంద్‌బాషా తెలిపారు. అందిన సమాచారం మేరకు అలిరెడ్డిపల్లె గ్రామంలోని ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేయగా వెంకటసుబ్బారెడ్డి అనే వ్యక్తి మద్యాన్ని విక్రయాలు చేస్తున్న విషయం బయట పడింది. దాడిచేసి 9 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని వెంకటసుబ్బారెడ్డి అనే వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

NAME CHANGE

My son name **KATIKA REDDY GUNAVANTHA REDDY** is changed as **KATIKA REDDY GUNAVANTH REDDY** father Katikareddy Madhusudhan reddy D.No. 2/69-A Near Old Police station Street Muddanur town Muddanur Mandal, YSR District.